

# భవబంధాలు

మంగళ్ళంపల్లి వెంకట సీతారామయ్య

జీవితంలో చాల సార్లు ఓడి పోయాను. ఓడిపోయినట్లుగా సామాన్యంగా సాయంకాలమే తెలిసేది. అందుకే నాకు సాయం కాలం అంటే అదొక రకమైన భయం. అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తుంటే అంతమొందుతున్న జీవితానుభూతిగా అనిపించేది.... ఆ క్షణంలో ఎవరికైనా సినిక్‌గా కనపడతాను.

మనోచాపల్యం వల్ల ఆ డిజైన్ అలా ఉంటే ఎంత బావుంటుందో అని అనిపించింది. నా మీద కసికొద్దీ ఏమో మరి కాసిని రాక్షసి చినుకులు మీదపడి దాన్ని వికృతం చేశాయి. గబ-గబా వరదరావు హోటల్ ఎదరొచ్చి ఆగాను. కుండపోతగా కురుస్తోంది. ఒక్కొక్కరే మెల్ల-మెల్లగా వచ్చి చేరుతున్నారు. క్షణ-క్షణానికీ వెనక్కి జరగాల్సి వచ్చింది. ఇంకా వెనక్కి వెళ్ళడంలో కాళ్ళకి ఏదో బుట్ట తగిలింది. చటుక్కున వెనక్కి చూశాను. ఓ ముసలమ్మ బజారు బుట్టలో వేరుశెనగ కాయలు, మరో బుట్టలో జంతికలు పెట్టు

---

ఆదరణ ఆత్మీయతకు బంధుత్వం సమాన హోదాలు అవుసరంలేదు!

మనసు మెత్తనైన ప్రతి మానవునికీ అందరూ సమానమే!

---

ఆ వేళ కూడ నేను ఓడిపోయిన ఓ సాయంకాల సమయం. బి. యడీలో చేరి రూముల కోసం ప్రత్యేకంగా తిరిగి-తిరిగి కాళ్ళు పీకే సమయానికి చెదురుమదురుగా తెల్లకొంగలుగా ఉన్న పిల్లమేఘాలు గుమిగూడి చిక్కటి ఏనుగుల బారుగా రాజమండ్రిని అంతా కప్పి వేశాయి. తృటి కాలంలో. అల్లంత దూరంలో ఉంది డీలక్స్. అప్పుడే పది-పదిహేను చినుకులు పడి చొక్కా కొత్త డిజైన్ రూపొందించుకుంది.

కుని కూర్చుంది. కవల పిల్లల్లా చెరోచేత్తో చుట్టేసి దగ్గరకి లాక్కుని కూర్చుంది. "ఏమను కోకు మామ్మ, చూశ్లేదు!" అన్నాను. "పర్లేదు బాబూ!" అంది. మామ్మ వెనకాలే ట్రాలీ ఉంది. అక్కడక్కడ దాని మీద కూర్చున్నారు జనం. నాకూ నీర్సంతో కూర్చోవాలనిపించింది. కాని మామ్మ ప్రక్కనేచోటు ఉంది. కాని కాళ్ళకి బుట్టలు తగుల్తాయి. మెల్లిగా "మామ్మా! ఇక్కడ కూర్చుంటాను. బుట్టలు కొంచెం ప్రక్కకి పెడ్తావా?"

అన్నాను. "కూకో బాబూ!" అంది. నే కూర్చున్న తరువాత మళ్ళీ బుట్టల్ని దగ్గరకి లాక్కుని కూర్చుంది.

కూర్చున్న తరువాత ఓ పదిపైసలు వేరుశెనగకాయలు కొనుక్కున్నాను. మనుషుల మధ్యనుంచి తిరుగుతున్న కార్ల లైట్ల వెలుగులో నిదానంగా, నిరాటంకంగా పడుతున్న వానధారల్ని చూస్తున్న మామ్మ కళ్ళకేసి చూస్తే-ఏదోవైరాగ్యం, వేదాంతం కనపడుతోంది. "మామ్మా! ఈ వర్షం వల్ల నీకు నష్టమా? లాభమా?" అన్నాను.


"లాబవే బాబూ! ఎంత లాబవో అంత నష్టం! నా గురించి ఆగిపోకుండా దిక్కుమాలిన అన....ఇప్పుడే ఏయించుకున్నాను ఈ బుట్ట జంతికలు - ఇప్పుడయితే కర-కర లాడతాయి. ఈ అనొస్తే మెత్తబడి పోతయ్. ఎవరు తింటారు!" అంది.

నిజమే! బ్రతుకు తెరువంతా ఆ రెండు బుట్ల మీద ఉంచుసుంది. ప్చ్-మౌనంగా కాయలు ఇనప కమ్మీని వేసి కొట్టుకుంటున్నాను. చేరిన జనంలో స్నేహాలు ఏర్పడ్డాయి. రక-రకాల టాపిక్స్ మాట్లాడుకుంటున్నారు. మాట్లాడిన వాళ్ళం నేనూ, మామ్మే అనిపించింది నన్ను పలకరించిన వాడు ఒకడే! అక్కడున్న అరగంటలో అరవైసార్లు టైమడిగాడు.

వర్షం వెలిసింది. అయినా రోడ్డు మీద నీళ్ళు తీసేవరకు నిలబడి ఉంది జన సమూహం. ఇంతలో "ఎక్కడెహే! ఆ ముసలి నంజ....." అంటూ బిగ్గరగా సణుక్కు వస్తున్న ఒక రిక్షావాలా-కమ్-త్రాగుబోతుని దూరంగా చూసి ఉలిక్కిపడి గబ-గబా మొల్లో ఉన్న గుడ్డ సంచీ తీసి ఒక రూపాయి కాగితం, గుప్పెడు చిల్లర తీసి నా చేతిలో పెట్టి "బాబూ! మీకాడ ఉంచండి. నే మళ్ళీ అడుగుతాను-ఆడొచ్చేస్తున్నాడు..." అంది. ఆ అభ్యర్థనలో ఒక విధమైన బాధ, ఆ కంఠంలో ఆదొక రకమైన వణుకు నన్ను విచలితుణ్ణి చేశాయి. అసంకల్పితంగా గుప్పెట మూసి జేబులో పెట్టుకోవడం, అతను మామ్మని సమీపించడం ఒక్క క్షణంలో జరిగాయి. "ఆ సంచీ ఇలాగియ్ నంజా!" అని మొల్లోంచి లాక్కున్నాడు. "ఏటిది-ఐదు పైసలా....ఛీత్!" అని సంచీ మొహం మీద కొట్టాడు. ఈ గబిడబిడతో వర్షం వెలవడం, అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళడం జరిగింది.

"నడు, రిక్షా ఎక్కు." అని బుట్టలు తీసుకొని రిక్షాలో పెట్టి, మామ్మని చెయ్యి పట్టుకు ఈడ్చుకు పోయాడు. ఇంచుమించుగా రిక్షా దగ్గరకి ఎక్కిన తర్వాత వెనక్కి చూసి చేత్తో సంజ్ఞ చేసింది 'మళ్ళీ వస్తాను' అన్నట్టుగా. రిక్షా జోరుగా వెళ్ళిపోయింది.

ఇంకో రిక్షా కేకేసి మా వాళ్ళింటికి




పోయాను. అక్కడ భోజనం చేసి తీరు బాటుగా లెక్క చూస్తే నలభై పైసలు తక్కువగా ఐదు రూపాయలు ఉన్నాయి. ఈలోగా మా అత్తయ్య "చిల్లర ఉంటే ఇవ్వు. నోట్లు ఇస్తాను." అని చిల్లర ఆవిడ తీసుకుంది. రాత్రి ఎప్పటికో గాని నిద్ర పటలేదు.

ఉదయమే లేచి అన్నీ ముగించుకొని కాలేజీకి వస్తూ అక్కడ చూస్తే మామ్మ లేదు. కాలేజీ టైమయింది. అక్కడ ఉన్న కొట్టు అతనితో చెప్పి, మామ్మ ఆనవాలు చెప్పి మధ్యాహ్నం వస్తానని చెప్ప మన్నాను. రీసెస్‌లో వచ్చి చూస్తే— హమ్మయ్య-మామ్మ ఉంది. చిరకాలంగా చూడని బంధువులని చూసినట్లు అనిపించింది. ''మామ్మా! చిల్లర అవసర మొచ్చింది.'' అంటూ అయిదు కాగితాలు పర్సులోంచి తీసి ఇచ్చాను. ముల్లో సంచీ తీసుకుంటోంది. ''నేను టిఫిన్ తినాలి.'' అంటూ నాల్గడుగులు వేసేసరికి ''బాబూ!'' అంటూ మళ్ళీ కేక వేసింది. "ఏం?" అంటూ ఆగాను. నలభై పైసలు చేతి కిచ్చింది. బిగిసి పోయాను. షాక్ నుంచి తేరుకొని "అయితే నిన్న నువ్వు లెక్క పెట్టుకున్నావా?'' అన్నాను ''మీకు నలభై పైసలు పెద్ద నష్టం కాదు గానీ, నేను లెక్క బెట్టుకోపోతే ఆ నలభై పైసలే పెద్ద నష్టం.'' అని పేలవంగా నవ్వింది.

నాకు ఆ క్షణంలో మామ్మలో మూర్తీభవించిన న్యాయం, ధర్మం కన్పించాయి. ''మామ్మా! రాత్రి.... అతనెవరు?'' ''నా కొడుకు బాబూ! కుక్కల కొడుకు! ఈడయితే ఎప్పుడో గోదారిలో కలిసి పోయేదాన్ని. కాని ఓ పొరపాటు చేశాను. ఈడికి నా మనుసురాల్ని ఇచ్చాను. దాని బాబూ, అమ్మా అమ్మోరి దగ్గరికి వెళ్ళి

పోయారు చిన్నప్పుడే. నేనే పెంచి ఈ ఎదవకి కట్టబెట్టాను. ఈడికో ఆడ కూతురు. అయినా సుకం నేదు. ఎంత సంపాయించినా తాగుతాడు. ఆళ్ళ తిండికి నేను సంపాయించాను అందుకే ఈ బాధ బాబూ!'' నేనింకా అలాగే నిలబడ్డం చూసి ''బాబూ! మీరు సదువుకునే ఓరు. ఇయేవి మనస్సులో పెట్టుకోకండి. మీకు నా దణ్ణాలు . లేపోతే ఈ అయిదూ అడైనా తాగేసే ఓడు .బగమంతుడు మిమ్మల్ని సల్లగా సూడాల....'' అని మెల్లిగా భుజం మీద తట్టి వెళ్ళిపోయింది. ఆ బుట్టలు కను మరుగయే వరకు అలాగే చూస్తూ ఉండి పోయాను. టైము అయిపోయింది. లోవ లకి వెళ్ళకుండా మళ్ళీ కాలేజీకి వెళ్ళి పోయాను.

తర్వాత ఏమి జరిగి ఉండకపోతే ఎంతో తృప్తి మిగిలేది....జీవితం లలిత మైన సంగీతంలా ఉండేది. కాని ఆరోజు విపరీతమయిన స్వరాలు వినపడ్డాయి. ఆర్కాట్ గార్డెన్స్‌కి వెడుతున్నాను రిక్షా మీద. ఓ చోట పోలీసులు హడావుడిగా తిరుగుతున్నారు. ట్రాఫిక్ బంద్ అయి పోయింది. ''మాస్టారూ! ట్రాఫిక్ బంద్ అయింది. గాడీలు వెళ్ళడం లేదు. కావ లిస్తే నడచి వెళ్ళండి'' అన్నాడు ఓ పోలీసు. రిక్షా దిగి, ఎదరకి నడచి వెళ్ళి పోతున్నాను వడి-వడిగా. నాకు యాక్సి డెంట్లు అన్నా వాటి గురించి వాకబులన్నా పెద్ద భయం, వడి-వడిగా అడుగులు వేసుకు పోతున్నాను. అయితే కుడిచేతి వేపున దూరంగా బద్దలుగా విరిగిపోయిన ఆ బుట్ట వికృతంగా కన్పించింది.

మనస్సులో తీతువు కూసింది వెనక్కి జంకుతూ వచ్చి చూశాను -ఆ మృత్యు చక్రం క్రింద మామ్మ శవం- కళ్ళు చీకట్లు క్రమ్మాయి అంతే- తర్వాత ఏం జరి గిందో నాకు తెలీదు.

కళ్ళు తెరిచేసరికి తెల్లటిబట్టలతో దేవ దూతలా పారిజాత పువ్వులా నవ్వుతూ నర్సు కన్పించింది. -''ఇక్కడికి ఎలా వచ్చాను? 'అని పైకి సణిగాను. నామాట విని బయట కూర్చున్న సుందర్, శర్మలు లోపలికివచ్చి యోగక్షేమాలు అడిగారు. ఓపిక వచ్చింది-డాక్టరుకి నమస్తేలు చెప్పి బయటకు నడచివచ్చాము.

వస్తుంటే చెట్టు క్రింద కూర్చుని ఉన్నాడు మామ్మకొడుకు వాడి ప్రక్కనే ఒక బక్క ప్రాణాన్ని చంకలో వేసు కొని ఒక అస్థిపంజరం లాంటి ఆడది వెక్కి-వెక్కి ఏడ్చి ఇంక ఏడ్వలేక దెక్కు తోంది. వారిప్రక్కన కూర్చుని ఎంత నష్టపరిహారం పుచ్చుకోవాలో తర్కించు కుంటున్నారు. మధ్యవర్తులు అటు, ఇటూ తిరుగుతున్నారు- వాళ్ళనిదాటి వచ్చేశాము. మామ్మ ప్రాణానికి విలువ కాస్పేవట్లో కడతారు. -పోనీ ఇప్పుడైనా జాగ్రత్తగా ఉంటుంటే మామ్మ ఆత్మ శాంతిస్తుంది.

నా అస్వస్థతవల్ల నేను మాట్లాడటంలేదని. సుందర్. శర్మలుకూడా మౌనంగా నన్ను అనుసరిస్తున్నారు.

మనసు వికలమయి ఒక వారం రోజుల వరకు మనిషిని కాలేకపోయాను. ఆ తర్వాత జీవితం మళ్ళీ గాడిలో పడి పోయింది. రికార్డులు, స్పెషల్ వర్కు— అంతా గజిబిజి - కాల ప్రవాహంలో గడ్డి పోచగా కొట్టుకుపోతోంది జీవితం.

ఇయితే మళ్ళీ అదే డీలక్సు హోటల్ దగ్గర ఓ సన్నివేశం జీవితానికి అర్థం నేర్పింది. వేదాంతం ఓ క్షణంలో అర్థ మయింది.

''బాబూ- బిడ్డ సచ్చిపోయింది-కడుపు శోకం- ఆకలి బాబూ - ధర్మం బాబూ-'' అని అరుస్తోంది ఓ బిచ్చగత్తె. అప్రయత్నంగా జేబులో చేయిపెట్టి డబ్బులు పైకి తీయకుండానే తడుముకున్నాను రెండు పైసల బిళ్ళకోసం- ఒకటి వుండాలని బాగా జ్ఞాపకం- అయితే అందల్లేదు. ఇంత సేపూ వెధవపోజు కొట్టి ఏమీ వేయలేక పోతే ఎలా అని అయిదు పైసలు తీసి వేస్తూ ''ఈ అదృష్టవంతురాలు ఎవరా,'' అని ముఖంకేసి చూశాను. -అరే-మామ్మ మనుమరాలు- ఆ వేళ హాస్పిటల్ దగ్గర చూశాను- ''సల్లగుండాల,'' సణుక్కుని నన్ను దాటిపోయింది ఆమె.

లోపలికి వెళుతూ ఏదో స్ఫురించి వెనక్కి తిరిగాను. ఒక ముసలి రిక్షావాలా ''బాబూ-గాడీ-''అన్నట్లుగా చూస్తున్నాడు. మెట్లదగ్గరకి కేక వేశాను. ''టీ తాగుతావా!'' అన్నాను. ''హి-హి- మీదయ'' అన్నాడు. కాఫీకి, టీకి ఆర్డరు యిచ్చి మెల్లిగా మామ్మకొడుకు గురించి వాకబు చేశాను.

''ఏం చెప్పను బాబూ- చచ్చిపోతూ కూడ వెయ్యి రూపాయలు ఇచ్చిపోయింది -మా ఎదవలకి అవసరానికి మించి అర పైసాకూడ ఎక్కువ ఉండకూడదు బాబయ్యా—ఒకటా- రెండా వెయ్యి రూపా

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాత్
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

యలు- జోరుగా తాగేసేవాడు—పైగా ప్రాకెట్టు- డబ్బు గలగల మంటుంటే అంతవరకు ఉపయోగించిన ఆడి ఆడది ఏ్రాపిలా కన్పించింది. ఓ బజారు ఎస వని తగుల్కున్నాడు. అంతా అయి పోయింది- బాకీపడితే ఓనరు రిక్షా లాగేసు కున్నాడు. తిండి, వైద్యం లేక చంటి ముండ గుటుక్కుమంది, ఆడు ఒంటి నిండా సంకటాలు తగిలించుకొని- రకత కన్నీరులో నాగభూషణంలా ఏడు త్తున్నాడు- అ ఎర్రిపిల్ల ఆడ్ని కనిపెట్టు కొని -అడుక్కుని -కాసిని గంజినీళ్లు పోస్తోంది- అదండీ ఇసయం- శలవు బాబూ- బేరాలు పోతాయి-'' అంటూ దణ్ణంపెట్టి పోయాడు. బిల్లు చెల్లించి బయటకు వచ్చాను. ఆ పిల్ల దూరంగా ఉంది. అటువేపుగా వెళ్లి జేబులో ఉన్న అయిదు రూపాయలు యిచ్చాను బిత్తర పోయింది -'కాదు- తీసుకో- వేరు శెనగ కాయలుఅమ్మే మామ్మ నాకు బాగాతెల్సు, పాపం చచ్చిపోయింది. తీసుకో, ఇంతి కన్నా ఏం చేయలేను'' అన్నాను.

మామ్మని తల్చుకొని బావురుమంది.- ''నేనూ దానిదగ్గరకు వెళ్లిపోదామని చాల సార్లు గోదారిగట్టు కెళ్ళాను. అయితే ఆడు దిక్కులేని చావుచత్తాడు. ఎవరూచూడరు. అని చావలేక బతుకుతున్నా బాబూ'' అని ఆగి, ''బాబూ! ఆడు చలికి వణికిపోతు న్నాడు— ఈ డబ్బెట్టి ఓ నల్లదుప్పటి కానిపెట్టండి బాబూ- మేము అడిగితే నాపి రకం అంటకడ్తారు'' అని డబ్బు యివ్వ బోయింది. ''అది నీ దగ్గర ఉంచుకో- కాస్త మనిషిగా తయారయి- ఈ పని మానేసి- ఏదైనా కూలి పనిచేసుకో - దుప్పటి నేను కొనిపెడ్తాను'' కళ్ళతో నీళ్ళు నింపుకొని చంటిపిల్లలా తల ఆడించింది.

ప్రక్క కొట్లోకి వెళ్ళి బిన్ని నల్ల దుప్పటికొని ఆమెకు ఇచ్చాను. ''దణ్ణాలు బాబూ- మీ మేలు మరువలేను- ఈ దుప్పటి ఆడికి కప్పుతాను. నే నీ పని మానేస్తాను బాబూ- కూలిపనిలోకి ఎడ తాను బాబూ - వత్తా బాబూ - వత్తా-'' అంటూ అస్థిపంజరాన్ని వడివడిగా కదు ల్చుకుంటూ నడచిపోయింది.

ఆమెని, ఆమెచేతిలో నల్లదుప్పటిని, ఆ దుప్పటి ఎర్ర అంచుని- కనరదేవరకు చూస్తుంటే- భుజంమీద ఎవరివో చేతులు పడ్డాయి-సుందర్, శర్మ- ''భవబంధాలు'' అన్నాను మెల్లిగా. *

---

మనమూ రంగంలోకి దిగాము. ఇకతుది విజయం సాధించే దాకా వెనుదిరిగి చూచేది లేదు. దేశ ప్రజల ఉత్సాహోద్రేకాలను ఒక సంపూర్ణమైన నిర్మాణ కృషిగా మనం మలచుకోవాలి.

శ్రీ పి. వి. నరసింహారావు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి.